కోఠి ఉమెన్స్ కాలేజీ వద్ద ఈవీఎంలు, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సులు

కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈవీఎం మిషన్లను తీసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని డీఆర్‌సీ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

నారాయణగూడలోని రెడ్డి కాలేజీ నుంచి ఈవీఎంలతో బయటకు వస్తున్న ఎన్నికల సిబ్బంది

ఓటేద్దాం.. రండి.!

మనం వేసే ఓటే.. రేపటి మన భవిష్యత్తు..!

ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని బలపరుద్దాం. ఇంటి నుంచి బయటకు రండి.. ఓటు హక్కును వినియోగించుకోండి. మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే భవిత. లేదంటే ఐదేండ్ల పాటు అంధకారమే. నీ సత్తా నిరూపించుకునే సమయం వచ్చినప్పుడు మిన్నకుండి తదనంతరం నిందించే కన్నా.. ముందే మేల్కోండి. సమాజంలో మార్పుతో కూడిన అభివృద్ధి సాధించాలంటే పోరులు యుద్ధాలు, త్యాగాలు చేయాల్సిన అవసరం లేదు. చేయాల్సిందల్లా ఒక్కటే.. పోలింగ్ రోజు నీకున్న హక్కు సద్వినియోగం చేసుకోవడమే. నీ కర్తవ్యం నెరవేర్చాల్సిన రోజున బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే.. సమాజమే కాదు.. దేశం కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. ఈ కొన్ని నిమిషాలు వెచ్చించి పోరులిచ్చే తీర్పు.. రాబోయే ఐదేళ్ల పాటు జీవన స్థితిగతుల్ని ప్రభావితం చేస్తుంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు నిరుపయోగం కాకుండా అందరూ సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం ప్రకాశిస్తుంది. ఆ క్షణాలు కొన్ని గంటల్లో మన ముందుకు రాబోతున్నాయి. రాష్ట్ర, దేశ భవిష్యత్తును మార్చే మీ ఓటు వేయడానికి అందరూ కలిసి రండి.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి.



నందినగర్‌లో ఓటు వేయనున్న కేటీఆర్

బంజారాహిల్స్,మే 12 (నమస్తే తెలంగాణ) : ఓటింగ్‌లో ఎప్పుడూ ముందుండే సినీ, రాజకీయ ప్రముఖులు ఈ సారి కూడా తమ ఓటు బాధ్యతను నిర్వర్తించడానికి సిద్ధమయ్యారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అవగాహన కల్పించిన ప్రముఖులంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లనున్నారు. కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే వారికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల వివరాలు ఎన్నికల అధికారులు అందించారు. నందినగర్‌లో కేటీఆర్ ఓటు వేయనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో సినీ ప్రముఖులు ఓటు వేయనున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, బీఎస్ఎన్ఎల్ పోలింగ్ బూత్‌లో అల్లు అర్జున్, అల్లు అరవింద్ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేష్‌బాబు, మంచు మోహన్ బాబు, మంచు విష్ణు, విజయ్ దేవరకొండ, శ్రీకాంత్, జీవితారాజశేఖర్ ఓటు వేయనున్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో దర్శకుడు రాఘవేంద్రరావు, చిరంజీవి, రాంచరణ్, దగ్గుబాటి రాణా, సురేష్‌బాబు, విశ్వక్‌సేన్ తదితరులు కుటుంబ సమేతంగా ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో హీరో రవితేజ, జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో అక్కినేని నాగార్జున, నాగచైతన్య, అఖిల్, అల్లరి నరేశ్, మణికొండ హైస్కూల్‌లో హీరో వెంకటేశ్, బ్రహ్మానందం ఓటు వేయనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో హీరో రామ్ తదితరులు ఓటు వేయనున్నారు. వీరితో పాటు షేక్‌పేట ఇంటర్నేషనల్ స్కూల్‌లో దర్శకుడు రాజమౌళి, గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలలో హీరో నాని ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

రాజకీయ ప్రముఖులు ఇలా..!

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శైలిమ దంపతులు బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నందినగర్‌లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అంబర్‌పేటలో తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. శేరిలింగంపల్లిలో ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇలా రాజకీయ ప్రముఖులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారు.

ఓటింగ్ సరళిపై నిఘా

- ప్రత్యేకంగా 200 మంది సిబ్బంది ఏర్పాటు
- జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూం
- ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు తెలియజేస్తాం
- జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మే 12, (నమస్తే తెలంగాణ) : ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించేందుకు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూం నుంచి గంట, గంటకు సమాచారం అందించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. జీహెచ్ఎంసీలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్, ఎన్నికల శాతం ఎప్పటికప్పుడు తెలియజేయడానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నియమావళి ప్రకారంగా విధులు నిర్వర్తిస్తున్నారా..? లేదా గమనించి నేరుగా సంబంధిత పోలింగ్ కేంద్రంలోని అధికారికి సూచన చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి తరచూ పరిశీలన చేసి పోలింగ్ కేంద్రంలో అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు కూడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా ఇక్కడి నుంచి ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వివరించారు. సెగ్మెంట్‌కు ఆరు గురు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్‌లు షిఫ్ట్ సిస్టమ్‌లో పనిచేస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో లోపల, బయట ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జరుగుతున్న సంఘటనలను ఎప్పటికప్పుడు పరిశీలించి జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేస్తారని పేర్కొన్నారు. పోలింగ్ అధికారికి తగు ఆదేశాలు జారీ చేస్తారని, సీసీ కెమెరాలతో పాటుగా ఓటింగ్ శాతాన్ని సెక్టోరల్ అధికారి ద్వారా తెలుసుకొని సమాచారం ఇస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలలో తప్పులు జరుగకుండా పూర్తి స్థాయిలో 200 మంది సిబ్బంది చూసుకుంటారని తెలిపారు.

మల్కాజిగిరి బరిలో 22 మంది

మేడ్చల్, మే 12(నమస్తే తెలంగాణ) : ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశంలో అతిపెద్ద పార్లమెంట్ స్థానమైన మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. మల్కాజిగిరి లోక్ సభ పరిధిలో 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 37,79,596 మంది ఓటర్లు ఉండగా.. ఏడు నియోజకవర్గాల్లో 3228 పోలింగ్ కేంద్రాలలో 12,026 మంది సిబ్బంది ఎన్నికల విధులను నిర్వహించనున్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు

మేడ్చల్, మే12(నమస్తే తెలంగాణ) : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బోగారంలోని హోలీ మేరి కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌లను స్ట్రాంగ్ రూమ్‌కు ఆదివారం తరలించారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్, ఎల్బీనగర్ నియోజకవర్గాలలో పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను పోలీసుల బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి భద్రపరిచినట్ల మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

హోలీ మేరి కళాశాలలో ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధమైన పోలింగ్ సిబ్బంది

స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించిన బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

అందుబాటులోకి సాధికార బౌద్ధ సాహిత్యం

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మే 12 : సుమారు ఇరవై ఏండ్ల కిందట తెలుగు భాషలో కల్పిత ఊహా జనిత కథలు తప్ప బౌద్ధం గురించి వాస్తవాలు అందుబాటులో లేవని నేడు సాధికార బౌద్ధ సాహిత్యం తెలుగులో అందుబాటులోకి వచ్చిందని విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి సి.ఆంజనేయ రెడ్డి అన్నారు. ఈ సాహిత్య ప్రచురణలో కెకె రాజా కృషి ప్రశంస నీయమని అభినందించారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై లతా రాజ ఫౌండేషన్ నిర్వహణలో బౌద్ధ సాహిత్యంపై పది రచనలతో పాటు ఇతర నాలుగు సామాజిక సాహిత్య సంపుటిల అవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ బుర్ర గోవర్ధన్, ఈమని నాగిరెడ్డి, నటరాజ్ శాఖ రచన నారాయణ గురు, డాక్టర్ బండి సత్య నారాయణ, రచన నిర్వహణ పట్టాభి రామయ్య, ప్రొఫెసర్ సుధారాణి, మధుకర్, డాక్టర్ పద్మాకర్, కేవీ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆంజనేయరెడ్డి, బి.నర్సింగ్ రావు, బొర్ర గోవర్ధన్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ సబ్ స్టేషన్‌లో మంటలు

కాలిపోయిన విద్యుత్ కేబుల్స్

ప్రమాదంపై అనుమానాలు

మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ) : మియాపూర్‌లోని 220కేవీ ఈహెచ్‌టీ సబ్ స్టేషన్‌లో అనుమానాస్పదంగా విద్యుత్ కేబుల్స్ కాలిపోయాయి. అప్రమత్తంగా ఉన్న సిబ్బంది వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ సర్క్యూట్ ద్వారా సరఫరాను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంతో ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా అయ్యే కైత్లాపూర్, మియాపూర్ 132/33 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలో సుమారు గంటకు పైగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నగరంలో అత్యధిక డిమాండ్ 4350 మెగావాట్లకు పైగా ఉన్నప్పుడు ఈ కేబుల్స్‌లో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆదివారం ఉదయం సమయంలో డిమాండ్ అతి తక్కువగా ఉన్నప్పుడు ప్రమాదం జరగడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విషయం తెలుసుకున్న తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ పోలీసు విచారణకు ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, టీఎస్ ట్రాన్స్‌కో డైరెక్టర్ ట్రాన్స్‌మిషన్ జగత్ రెడ్డి, మాదాపూర్ జోన్ డీసీపీ వినీత్, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కాగా మియాపూర్ మెట్రో డిపో పక్కన ఉన్న సబ్ స్టేషన్‌లోకి బయట నుంచి ఇతరులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని పలువురు తెలిపారు. అదేవిధంగా 220, 33 కేవీ లైన్‌లు పక్క పక్కనే ఉండడం, వాటికి ఉండే జాయింట్‌ల వద్ద లోడ్ పెరిగినప్పుడు షాక్ సర్క్యూట్ వచ్చి కాలిపోయే ప్రమాదం ఉంటుందని విద్యుత్ నిపుణులు తెలిపారు. ఈ సంఘటనపై విద్యుత్ శాఖ అధికారులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాలిపోయిన 220 కేవీ విద్యుత్ కేబుల్స్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈవీఎం యంత్రాలను తీసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

క్యాబ్‌లకు భలే డిమాండ్

ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్సులు, రైళ్లు

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న జనం

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల దృష్ట్యా చాలా మంది తమ సొంతూళ్లకు బయలుదేరుతుండటంతో బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా క్యాబ్‌లకు డిమాండ్ ఏర్పడింది. కుటుంబ సమేతంగా క్యాబ్‌లలో సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో క్యాబ్ డ్రైవర్లు గత పది రోజుల నుంచి దూర ప్రాంతాలకు నిశ్చయించుకున్నారు. ఇప్పటికే నగరం నుంచి సుమారు 7వేల క్యాబ్‌లు ఆంధ్ర ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నాయని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. చాలా మంది బస్సు ప్రయాణం కంటే కారులోనే ప్రయాణించడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితి మరో పది రోజుల వరకు ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ నగరానికి ప్రయాణాలు భారీగా ఉంటాయని తెలిపారు. వేసవి సెలవులు కూడా కావడంతో ప్రయాణాలు పెరిగాయని చెప్పారు. ఈ క్రమంలో ఎల్‌బీనగర్, దిల్‌షుక్‌నగర్, ఉప్పల్, బాలాపూర్, ఆరంఘర్ తదితర ప్రాంతాల్లో క్యాబ్‌లు విరివిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒకే చోటుకు వెళ్లే ప్రయాణికులంతా కలిసి తమను సంప్రదించినా వాహనాలు సమకూరుస్తున్నామని క్యాబ్ డ్రైవర్లు తెలిపారు.

గ్రేటర్‌కు రాగల రెండు రోజులు వర్షసూచన

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ) : ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో పక్క నగరంలో ఉష్ణోగ్రతలు మరోసారి క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27.7డిగ్రీలు, గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

శివపార్వతికి సావిత్రి స్మారక పురస్కారం

ముషీరాబాద్, మే 12 : రామ్‌కుమార్ కళారవిందం సాంస్కృతిక వేదిక మూడవ వార్షికోత్సవం ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. పలువురు గాయనీ, గాయకులు అఖిల, రేణుక, జ్యోతి, భార్గవి, మానస, చైతన్య, ఊర్మిళ, ప్రదీప్‌చంద్ర, రవి తదితరులు ఆలపించిన మధుర గీతాలు స్రోతలను అలరించాయి. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రముఖ సినీ నటి శివపార్వతికి మహానటి సావిత్రి స్మారక పురస్కారం అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు సీహెచ్ త్రినాథరావు, రామ్‌కుమార్ కళారవిందం సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు రామ్‌కుమార్, శ్రీసంజీవి తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి శివపార్వతికి పురస్కారాన్ని అందచేసిన వంశీ రామరాజు

ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం తగదు

బండ్లగూడ, మే 12 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుల బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ తెలిపారు. ప్రజల తలరాతలను మార్చే ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు. ఆదివారం ఆయన చింతకుంట పార్కులో గుడ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వాకర్స్‌తో కలిసి తమ ఓటును తప్పని సరిగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, సుబ్బరాజు, మధు, సుధాకర్, ప్రభాకర్, ప్రవీణ్, నరసింహ, కొంగల శ్రీనివాస్, శెటిగారి శేఖర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌తో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్